క్లుప్తంగా

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ ఆశాబీ, వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా

ధర్మవరం అర్బన్: నార్పలలో ఉన్న గూగూడు కుళ్లాయిస్వామి అన్నదాన సత్రం నిర్మాణానికి ధర్మవరం 28వ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశాబీ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా రూ.1.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఆదివారం వారు గూగూడు కుళ్లాయి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విరాళం మొత్తాన్ని ఆలయ ధర్మకర్తకు అందించారు. విరాళం అందించిన వీరిని పట్టణ ప్రజలు అభినందించారు.

కంటి ఆపరేషన్లకు 23 మంది ఎంపిక



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ కోశాధికారి వేణుగోపాలాచార్యులు

ధర్మవరం అర్బన్: పేదలకు కంటిచూపును అందించడమే లక్ష్యమని లయన్స్‌క్లబ్ కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి వేణుగోపాలాచార్యులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 45 మందికి కంటి పరీక్షలు చేయగా 23 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారని తెలిపారు. వారందరికి షెడ్యూల్ తేదీల ప్రకారం ఎర్రగుంటలోని లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు చేసి కళ్లద్దాలు అందిస్తామని లయన్స్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పల్లెం వేణుగోపాల్, గోసే రాధాకృష్ణ, చందా నాగరాజు, రమేష్‌బాబు, నాగేంద్ర, పల్లెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర హైకోర్టు జడ్జి మన్మథరావును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోలీస్ గెస్ట్ హౌస్‌కు వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి కె.మన్మథరావును ఆదివారం ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు, కార్యదర్శి రాఘవేంద్ర, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఇతర న్యాయవాదుల సమస్యలను జడ్జికి విన్నవించారు. అనంతరం హైకోర్టు జడ్జిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు కేఎం అతావుల్లా, కృష్ణమోహన్, నరేష్, దస్తగిరి, సుమలత, బిల్లే రవీంద్ర, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తలుపుల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా తలుపుల ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివతేజ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలో అక్రమంగా ఆంధ్రా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మార్కెట్ వీధిలో ముత్యాలు అనే వ్యక్తి సంచిని పరిశీలించి, 34 ఆంధ్ర మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కానిస్టేబుళ్లు ఉమాశంకర్, రాజప్ప చాకచక్యంగా వ్యవహరించారన్నారు. పట్టణంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్ముతున్నా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి అమ్మినా, మట్కా, పేకాట ఆడినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజన్న ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- భైరాపురంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



కొత్తచెరువు మండలం భైరాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తచెరువు మండలం భైరాపురంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం 11 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ పూలమాలలతో నివాళులర్పించారు. కొత్తచెరువు మండలంలోని బైరాపురం, సాయినగర్, ఓబుళదేవరపల్లి, అప్పలవాండ్లపల్లి, బండ్లపల్లి గ్రామాల్లో యువకులు పెద్ద ఎత్తున బైకు ర్యాలీ చేపట్టారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి దారి పొడవునా పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తరలివచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ బాటలో నడుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబాన్నీ ఆదుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటూ ఫ్యాన్ గుర్తుకు వేసి వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ హయాంలో రైతుల కోసం ఉచిత విద్యుత్ హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలు, ప్రజలందరి కోసం 108 వాహనాలను సమకూర్చి అభివృద్ధిలో భాగస్వాములయ్యారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో జగనన్నకు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైనట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నక్క జిత్తుల పల్లె, బాబు గ్రామాల్లోకి వస్తారన్నారు. నెరవేర్చని హామీలు ఇచ్చి వెళ్తారని గుర్తు చేశారు. టీడీపీ నాయకుల మాటలను నమ్మకూడదన్నారు. వాళ్లు గ్రామాల్లోకి వస్తే గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో నిలదీయాలని సూచించారు. సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన హామీలను నెరవేర్చారని తెలిపారు. సీఎం ప్రభంజనాన్ని చూసి టీడీపీ వాళ్లకు దిక్కుతోచడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, కన్వీనర్ జగన్ మోహన్‌రెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, దాల్‌మిల్ సూరి, శ్యాంసుందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, గ్రామస్తులు ఓబుళరెడ్డి, రఘునాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివర్ధన్ రెడ్డి, బాలచంద్రారెడ్డి, రహంతుల్లా, బల్రా శివారెడ్డి, బల్రా యశ్వంత్, రామస్వామి, ఎంపీటీసీ గంగరాజు, జయప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లు, డైరీలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌టీఎఫ్ ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పీవీ రమణారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, సుబ్బారెడ్డి, సాయనాథ్ రెడ్డి, క్రిష్టప్ప, సురేంద్ర, నాభూషణం, మల్లేష్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జగదీష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ/కదిరి టౌన్: దొన్నికోట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఎం.నరసింహులు కుమారుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఎం.జగదీష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం కదిరిలోని నివాసంలో కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం జగదీష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే వేళ్లమద్ది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు టీడీ సుదర్శన్ రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గంగిరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, అంజి, అశోక్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, టీడీ విజయ భాస్కర్ రెడ్డి, రాంమోహన్, దొన్నికోట నాగరాజు నాయుడు, రవిచంద్రారెడ్డి, ఇస్మాయిల్, రమణారెడ్డి, జయపాల్‌రెడ్డి, కుళ్లాయి నాయక్, ప్రతాప్‌రెడ్డి, డీలర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఓడీచెరువు మండలం పెద్దగుట్లపల్లికి చెందిన పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం పుట్టపర్తి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాసులు, జయమ్మ, రవణమ్మ, చెల్లా లక్ష్మీనారాయణ, నంజప్ప, ఈశ్వరమ్మ, వెంకటస్వామి, రవి, నాగమ్మ, లక్ష్మీదేవి, శారదమ్మ, సుధమ్మ, కళ, ప్రసాద్, శ్రీనివాసులు, మంజుల, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, శోభ, తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీల చేరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

కృతజ్ఞతలు..

పుట్టపర్తి: నియోజకవర్గంలో 193 చెరువులకు నీటిని నింపేందుకు చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు.

పథకాలే విజయానికి సోపానాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

- సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీ 13, 14, 15 వార్డుల్లో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కదిరిలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ గెలుపు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అందరం కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలే మన విజయానికి సోపానాలు అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, పరికి సాధిక్, కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్‌కుమార్, ఇలాహి, నౌషాద్, దాదాపీర్, ఓంప్రకాష్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

తలుపుల: మండలంలోని గొల్లపల్లి తండాలో ఆదివారం నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి పర్యటించారు. సర్పంచ్ గౌరమ్మ, శ్రీనానాయక్ ఆధ్వర్యంలో తండావాసులు సాదరంగా ఆహ్వానించారు. సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరొక్కసారి ఆశీర్వదించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. తండాలో తాగునీటి సమస్య తలెత్తకుండా మండల పరిషత్ గ్రాంట్‌లో బోరు వేయిస్తామన్నారు. గుడి నిర్మాణానికి సహకారం అందిస్తామని తండా వాసులకు హామీ ఇచ్చారు.



తలుపుల మండలం గొల్లపల్లి తండాలో పథకాలను వివరిస్తున్న మక్బూల్ అహ్మద్

వినాయక ఆలయంలో వేద పారాయణం



వేద పఠనం చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యాదవవీధిలో నూతనంగా నిర్మిస్తున్న స్వయంభు వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం 20 మంది అర్చకులు గణపతి ఉపనిషత్తు సహస్ర వేద పారాయణం చేశారు. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సుమారు ఐదు గంటల పాటు వేద పఠనం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున, కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి సురేష్‌బాబు, ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, రాజశేఖర్ శర్మ పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కనగానపల్లి: చెట్టుపై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు పీ ఈశ్వరరెడ్డి (60) ఆదివారం మృతి చెందాడు. మండలంలోని మామిళ్లపల్లికి చెందిన రైతు ఈశ్వరరెడ్డి వారం రోజుల క్రితం పొలం దగ్గర చెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా జారి కింద పడ్డాడు. ఆ సమయంలో అతని వెన్నెముక విరిగింది. దీంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తలుపుల: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రఫీనాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

జటాయువు మోక్ష ఘాట్ పరిశీలన



జటాయువు ఘాట్ పరిసరాలను పరిశీలిస్తున్న కరణం రామానందన్

లేపాక్షి: మండల కేంద్రంలోని జటాయువు మోక్ష ఘాట్ పరిసరాలను లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆదివారం ఉదయం సందర్శించారు. జటాయువు మోక్షఘాట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఆలయాలు, కోనేరు నిర్మాణం విషయాలపై పలువురితో చర్చించారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ విషయాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

హిందూపురం: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ కరణం రమానందన్‌ను ఆదివారం హిందూపురంలోని ఆయన స్వగృహంలో కర్ణాటక బెంగళూరులోని ప్రసిద్ధి గాంచిన అణమ్మదేవి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా ఎన్నికైనందుకు అభినందించి అణమ్మదేవి ప్రసాదాన్ని అందజేశారు.

ముగిసిన బాబా షర్ఫోద్దీన్ ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి

తలుపుల: స్థానిక కుమ్మరపేటలో రెండు రోజులుగా నిర్వహించిన సయ్యద్ బాబా షర్ఫోద్దీన్ ఉరుసు ఆదివారం ముగిసింది. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి ఉరుసులో పాల్గొని, ప్రార్థనలు చేశారు. అంతకుముందు వారు దర్గాలో చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ పయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శుభకార్యం

నల్లమాడ: రెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు సుబహాన్ కుమార్తె సల్మాకు, తిప్పయ్యగారిపల్లికి చెందిన జాఫర్ వలీ కుమారుడు సూరజ్‌తో ఆదివారం నిఖా జరిగింది. కదిరి పట్టణంలోని అమృత ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీన ర్ కే.సూర్యనారాయణ, సహకార సంఘం అధ్యక్షులు ఏ.గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు కే.రవిచంద్రారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, కుళ్లాయినాయక్, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎంపీ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిమర్రి: మండలంలోని తురకవారిపల్లి సమీపంలో ఆదివారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామం సమీపంలో ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్ఐ నాగస్వామి సిబ్బందితో పేకాట స్థావరంపై చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. మరో ఎనిమిది మంది పారిపోయారు. పట్టుబడిన జూదరుల నుంచి రూ.16,560 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఏడు ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని సోమవారం వారిని ధర్మవరం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు విష్ణు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాశీనాయన ఆశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గరుడంపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ధర్మశాస్త్ర కాశీనాయన ఆశ్రమ అభివృద్ధికి బత్తలపల్లి మండలం సంగాల గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ, వెంకటరెడ్డి దంపతులు విరాళం అందజేశారు. ఆదివారం రూ.50 వేలను ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కనేకంటి శివారెడ్డి, శంకర చౌడప్పకు అందించారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు బత్తలపల్లి జట్టు





పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, విజేతగా నిలిచిన బత్తలపల్లి జట్టు

ధర్మవరం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుంది. క్రీడలు శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో ఆదివారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు క్రికెట్ ఆడారు. ధర్మవరం టౌన్, బత్తలపల్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బత్తలపల్లి జట్టు 74 పరుగులు సాధించగా.. ధర్మవరం జట్టు 70 పరుగులు మాత్రమే చేసింది. బత్తలపల్లి జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన బత్తలపల్లి జట్టు త్వరలో పుట్టపర్తిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పీఈటీలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఇద్దరికి గాయాలు



గాయపడిన తిరుపాలు

నల్లమాడ: నల్లమాడ–ఓడీ చెరువు రహదారిలో ఎద్దులవాండ్లపల్లి తండా సమీపంలో ఆదివారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రత్యక్ష సాక్షులు, కదిరి ఏరియా ఆస్పత్రి ఔట్‌పోస్టు హెడ్ కానిస్టేబుల్ శంకర్‌బాబు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సాయికుమార్ నల్లమాడ మండలంలోని పులగంపల్లిలో వివాహం చేసుకున్నాడు. రెండు రోజుల క్రితం పులగంపల్లికి వచ్చిన సాయికుమార్ ఆదివారం ఉదయాన్నే తన ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. అలాగే ఓడీచెరువు మండలం తుమ్మలకుంట్లపల్లికి చెందిన తిరుపాలు నల్లమాడ ఎస్సీ కాలనీలో వివాహం చేసుకున్నాడు. అత్తవారింటికి వచ్చిన అతను కూడా ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎద్దులవాండ్లపల్లి తండా సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న వీరి ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయికుమార్ కుడి చేయి విరిగింది. అలాగే కాళ్లు, చేతులు, తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. తిరుపాలు కుడికాలు విరిగినట్లు సమాచారం. కదిరి ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సాయికుమార్‌ను అనంతపురం తరలించారు. తిరుపాలు కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.


సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల తనిఖీలు



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలి. కక్ష్యలు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని సంఘాల, విశ్వనాథపురం గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. అనుమానిత ఇళ్లలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం, పేకాట, గుట్కాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనవసరమైన విషయాల్లో తలదూర్చి గొడవలు, ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల వరకే రాజకీయాలు తర్వాత గ్రామంలో అందరూ కలిసి మెలసి జీవించాలన్నారు. రాజకీయాలను రాజకీయంగానే చూడాలని వ్యక్తిగత ఘర్షణలు, గొడవలకు దారితీసేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, షమీవుల్లా, పోలీసు సిబ్బంది ఆంజనేయులు, పెద్దారెడ్డి, నారాయణస్వామి, గోపాల్, అశ్వని, నారాయణస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి అపహరణ



రాగి తీసుకుని బాక్సును వదిలివెళ్లిన దృశ్యం

లేపాక్షి: మండలంలోని మానేపల్లి జగనన్న కాలనీలో శనివారం రాత్రి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు అపహరించినట్లు ఏఈ వెంకటేశులు తెలిపారు. ఆదివారం ఉదయం కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి గురైందని స్థానిక విద్యుత్ అధికారులు తమ దృష్టికి తెలియజేశారన్నారు. వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. జగనన్న కాలనీలో తాగునీటి కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, అయితే ట్రాన్స్‌ఫార్మర్‌లో అందులో ఉన్న రాగిని ఎత్తుకెళ్లారని, దాని విలువ రూ. 2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బసినేపల్లి తండాకు చెందిన తిరుపాల్ నాయక్ బైక్‌పై పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా ఆసుపత్రి సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో తిరుపాల్ నాయక్, మరో బైక్‌పై వెనుక కూర్చున్న సావిత్రి గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

31న అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 31న బహిరంగ వేలం జరగనుంది. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.